బేగంపేట గురుమూర్తి లైన్‌లో వైన్ షాపుతో ఇబ్బందులు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే మాధవరం

కూకట్‌పల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బేగంపేట గురుమూర్తి లైన్‌లో వైన్ షాపు ఉండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దాని అనుమతి రద్దు చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలానగర్ ఎక్సైజ్ పోలీసులను కోరారు. గురుమూర్తి కాలనీ ప్రారంభంలో ఉన్న వైన్స్ కారణంగా అటువైపు మహిళలు, చిన్నపిల్లలు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమించి వాహనాలను రోడ్డుకు అడ్డుగా పెట్టడంతో కాలనీలోకి స్థానికులు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. బహిరంగ ప్రదేశంలో మద్యం తాగడం, బహిరంగ మలవిసర్జన చేయడం వంటి ఇబ్బందులు ఉన్నాయని కాలనీవాసులు ఇచ్చిన సమాచారం మేరకు ఎమ్మెల్యే వైన్స్ ఏర్పాటు చేయవద్దని ఎక్సైజ్ శాఖను కోరినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న, చోరీకి గురైన సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత



సెల్‌ఫోన్ బాధితులతో ఏసీపీ, ఎస్‌హెచ్‌వో తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొబైల్ వినియోగదారులు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు కూకట్‌పల్లి పీఎస్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గత కొన్ని నెలలుగా పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన 52 సెల్‌ఫోన్స్‌ను బాధితులకు అప్పగించారు. ఇందులో కూకట్‌పల్లి-40, బాచుపల్లి-12 ఉన్నట్లు చెప్పారు. సీఐఈఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) ద్వారా సెల్‌ఫోన్స్ గుర్తించి పట్టుకున్నట్లు చెప్పారు. ఏదో ఫిర్యాదు చేయమంటే చేశాం. కానీ మా ఫోన్లు మాకు వస్తాయని అనుకోలేదని పలువురు సెల్‌ఫోన్ బాధితులు పోలీసుల నుంచి అందుకున్న తర్వాత అన్నారు. పోలీసుల పనితీరుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వో కేవీ సుబ్బారావు, కూకట్‌పల్లి డీఐ కొండల్‌రావు, బాచుపల్లి డీఐ ఎన్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహానికి క్షీరాభిషేకం



భగత్‌సింగ్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన కాలనీవాసులు

అల్లాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ డివిజన్ పరిధిలోని పాండురంగ నగర్ కాలనీలో భగత్‌సింగ్ విగ్రహంపై సిరా చల్లి అవమానించిన ఘటన తమను బాధించిందని పేర్కొంటూ పలువురు నిరసన వ్యక్తం చేశారు. మూసాపేట్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం పాండురంగ నగర్ కాలనీలో భగత్ సింగ్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేంద్ర మాట్లాడుతూ.. జరిగిన సంఘటన విచారకరమని, సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దుండగులను గుర్తించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షుడు ఇంగర్‌జిత్ సింగ్, భగత్ సింగ్ యువజన సంఘం సభ్యులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● అభివృద్ధి పనుల విషయంలో రాజీపడొద్దు

● జలమండలి అధికారులతో సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ



జలమండలి అధికారులు, కార్పొరేటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీపడకూడదని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ జలమండలి కార్యాలయంలో మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జలమడలి ఎండీ అశోక్‌రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ డైరెక్టర్ ఆపరేషన్స్ వీపీ శ్రీధర్, సీజీఎం నారాయణ, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. జలమండలి అధికారులు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని, వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. ఇంజనీరింగ్, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రోడ్డు కటింగ్ సమయంలో తాగునీటి, డ్రైనేజీ పైపులైన్లు వేసేటప్పుడు తవ్విన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆయన ఆదేశించారు. యూజీడీ, రోడ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, తాగునీటి సరఫరా వ్యవస్థను సరిగా నిర్వహించాలని, డ్రైనేజీ పొంగిపొర్లకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, రాగం నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, దొడ్ల వెంకటేష్‌గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, జనరల్ మేనేజర్లు కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, హరిశంకర్, డీజీఎంలు నారాయణ, నాగప్రియ, శరత్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల ప్రజాబాట

హైదర్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి విద్యుత్ అధికారులు మంగళవారం వివేకానందనగర్ డివిజన్‌లో ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కాలనీలో పర్యటిస్తూ విద్యుత్ సమస్యలపై ఆరాతీశారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వేలాడుతున్న వైర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు అధికారులను కోరారు. చిన్నచిన్న విద్యుత్ సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించారు. సీఎం ఆదేశాలతో ప్రతి మంగళ, గురు, శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినియోగదారులతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆపరేషన్స్ డీఈ జనప్రియ తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ ప్రసాద్, ఏఈ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.



వివేకానందనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్‌అధికారులు

కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌లో..

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మీకు విద్యుత్ సమస్యలు ఏమైనా ఉన్నాయా? అంటూ వినియోగదారులతో టీజీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ పాండ్య ముచ్చటించారు. ఈ మేరకు కేపీహెచ్‌బీ ఆరోఫేజ్ అబ్దుల్ కలాం పార్కులో మంగళవారం బస్తీబాటలో భాగంగా వినియోగదారులతో సమావేశం అయ్యారు. ఎన్ఆర్ఎస్ఏ, సీబీసీఐడీ, సర్దార్‌పటేల్ నగర్, వసంతనగర్ ప్రాంతాల్లో ఓహెచ్ నుంచి ఏబీ కేబుల్, ఎల్‌టీ యాడెడ్ లైన్ మార్చినందుకు వినియోగదారులు ఆయకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు ఎల్లప్పుడూ వినియోగదారులకు అందుబాటులో ఉండాలని ఎస్ఈ సూచించారు. ఫిర్యాదు అందిన నిమిషాల వ్యవధిలోనే సంఘటనా స్థలానికి చేరుకోవడం, విద్యుత్ పునరుద్ధరణకు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ ఆదినారాయణ, ఏఈ వాణి, ఎస్ఎల్ఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో..

కూకట్‌పల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించేదుకు కృషి చేస్తామని ఎస్ఈ చంద్రశేఖర్ అన్నారు. మూసాపేటలోని ఇందిరానగర్‌లో డీఈ శ్యామ్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

నవంబరు 16న బ్రాహ్మణుల కార్తీక సమారాధన

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గం బ్రాహ్మణ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నవంబరు 16న కార్తీక సమారాధన, బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఆహ్వానపత్రికను మూసాపేట్‌లోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో సమాఖ్య అధ్యక్షుడు వీవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పంచ గంగేశ్వర్ ఆవిష్కరించారు. కేపీహెచ్‌బీ ఏడో ఫేజ్‌లోని బ్రాహ్మణ అపర కర్మల భవనం, పెద్దమ్మతల్లి ఆలయాల మధ్యలో ఉన్న నీలకంఠేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రాహ్మణ కులస్థులు హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నేమాని సూర్యనారాయణ, కోదండ రామయ్య, ప్రతాప్‌కుమార్, గరికపాటి సీతారామ శర్మ, రమాదేవి, ఎన్.కుమార్ పాల్గొన్నారు.



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు



ఉత్సవాల్లో పాల్గొన్న ఎర్రబెల్లి సతీష్‌రావు

మత సామరస్యానికి ప్రతీక గ్యార్మీ షరీఫ్

హైదర్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎన్టీఆర్‌నగర్ దర్గా వద్ద ఖాసీం ఆధ్వర్యంలో జరిగిన గ్యార్మీ షరీఫ్ ఉత్సవంలో బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీక గ్యార్మీ షరీఫ్ అన్నారు. అందరూ కలిసి సామరస్యంగా జరుపుకునే వేడుక అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో..

హైదర్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ దర్గాలో నిర్వహించిన గ్యార్మీ షరీఫ్ ఉత్సవంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వడ్డించారు. కార్యక్రమంలో మల్లేష్, పెద్ద ఖాజా, చిన్న ఖాజా, షౌకత్ అలీమున్నా, రెహమాన్, శివ, మహేష్, బషీర్, ఖలీమ్, సాయి, సందీప్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ మెట్రోకు శ్రావణి హాస్పిటల్స్ పేరు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్‌కు మంగళవారం శ్రావణి హాస్పిటల్స్ పేరు పెట్టారు. ఎల్ అండ్ టీ మెట్రో రైల్‌తో హాస్పిటల్ యాజమాన్యం ఒప్పందం చేసుకుంది. ఇక నుంచి శ్రావణి హాస్పిటల్స్ కేపీహెచ్‌బీ కాలనీ మెట్రో స్టేషన్‌గా అనౌన్స్‌మెంట్ చేయనున్నారు. ఈ మేరకు హాస్పిటల్స్ అధ్యక్షుడు డా. చెట్టుపల్లి నవీన్, సీఈవో శ్రావణి, ఎల్ అండ్ టీ మెట్రోరైల్ సెక్యూరిటీ హెడ్ లోకేశ్ సక్సేనా దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐ కియో ప్లస్ ఆరోగ్య కియోస్క్‌ను మెట్రో ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. శ్రావణి హాస్పిటల్స్ పేరు పెట్టిన సందర్భంగా ప్రయాణికులకు ఉచితంగా ప్రథమ చికిత్స కిట్‌లను అందజేశారు. ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు హాస్పిటల్ సీఈవో చెట్టుపల్లి శ్రావణి తెలిపారు.

పని చేస్తున్న భవనం పైనుంచి జారిపడి కార్మికుడి మృతి



జహంగీర్ షా(ఫైల్)

బాలానగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనం రెండో అంతస్తు నుంచి జారిపడిన కార్మికుడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాగా టూల్స్ సమీపంలో జరుగుతున్న ఏటూఏ కన్‌స్ట్రక్షన్ వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాలానగర్ సీఐ టి.నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన జహంగీర్ షా(31) భార్యా పిల్లలను సొంత ఊరిలో వదిలి బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి బాలానగర్‌లోని ఏటూఏ కన్‌స్ట్రక్షన్‌లో లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం రెండో అంతస్తులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ జారి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో కొంపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం అందుకున్న బాలానగర్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బాబాయి హజ్రత్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పంచతంత్ర'పై నిర్లక్ష్యం

- కళావిహీనంగా మారుతున్న పార్కు
- ఎండిపోతున్న గడ్డి
- విరిగిపోతున్న బొమ్మలు
- పట్టించుకోని అధికారులు



పంచతంత్ర పార్కు ముఖద్వారం



పంచతంత్ర కథలను వివరించే బొమ్మలు







పార్కులో ఎండిపోయిన గడ్డి

రాయదుర్గం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ వెస్ట్ జోన్ పరిధిలో గోపన్‌పల్లి జర్నలిస్ట్ కాలనీలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పంచ తంత్ర పార్కు సరైన నిర్వాహణ లేకపోవడంతో కళావిహీనంగా మారింది. దేశంలోనే మొదటి సారిగా చిన్న పిల్లలకు పంచతంత్ర కథలను వివరించేలా ఏర్పాట్లు చేశారు. ఆడియో సిస్టమ్ ద్వారా వినిపించే పంచతంత్ర కథలకు సంబంధించిన బొమ్మలను పార్కులో ఏర్పాటు చేశారు. వీటితో పాటు పచ్చటి మొక్కలు, రంగు రంగుల పూల చెట్లను ఏర్పాటు చేశారు. పార్కులోకి ప్రవేశించగానే పెద్దలకు, పిల్లలకు ఆహ్లాదాన్ని అందించడంతో పాటు చిన్నారులకు ఒకప్పుడు ఇళ్లల్లో తాత, బామ్మలు చెప్పే పంచతంత్ర కథలను వినిపించే ఏర్పాట్లు చేశారు. పార్కు ఏర్పాటు సమయంలో అప్పటి జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ కమిషనర్ దాసరి హరిచందన ప్రత్యేక శ్రద్ధ వహించి ఏర్పాట్లను పరిశీలించారు. జడ్‌సీ పంచతంత్ర పార్కు ఏర్పాటుకు ఆసక్తి కనబరచడంతో సీఎస్ఆర్ నిధులతో ఓ ప్రైవేటు విద్యా సంస్థ పార్కును అభివృద్ధి చేయటానికి ముందుకు వచ్చింది. ఆ నిధులతో పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేశారు. పార్కులో జంతువుల బొమ్మలు ఏర్పాటు చేశారు. దీంతో ఈ పార్కు ఇతర ప్రాంతాల పార్కులకు ఆదర్శంగా నిలుస్తుందని అందరూ భావించారు.

అధికారుల నిర్వహణ లోపం..

పార్కు ప్రారంభమైన సంవత్సర కాలంలోనే అధికారులు నిర్వాహణను గాలికి వదిలేయడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. దీంతో కొన్ని చోట్ల గడ్డి ఎండిపోయింది. గేటు వద్ద వాల్‌కు ఏర్పాటు చేసిన మొక్కలు ఎండిపోయి కళా విహీనంగా మారాయి. మూడు కోతుల బొమ్మల్లో ఒక బొమ్మ చేయి విరిగింది. పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో పార్కు సందర్శకులను ఆకట్టుకోలేని విధంగా మారింది. ఆ మూలంగా పార్కుకు వచ్చే సందర్శకులు తగ్గిపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు నిర్వాహణపై దృష్టి సారించాలని సందర్శకులు కోరుతున్నారు.



వివేకానందనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

విద్యుత్ అధికారుల 'ప్రజాబాట'

హైదర్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి విద్యుత్ అధికారులు మంగళవారం వివేకానందనగర్ డివిజన్‌లో ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కాలనీలో పర్యటిస్తూ విద్యుత్ సమస్యలపై ఆరాతీశారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వేలాడుతున్న వైర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు అధికారులను కోరారు. చిన్నచిన్న విద్యుత్ సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించారు. సీఎం ఆదేశాలతో ప్రతి మంగళ, గురు, శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినియోగదారులతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆపరేషన్స్ డీఈ జనప్రియ తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ ప్రసాద్, ఏఈ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న ఎర్రబెల్లి సతీష్‌రావు

మత సామరస్యానికి ప్రతీక గ్యార్మీ షరీఫ్

హైదర్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎన్టీఆర్‌నగర్ దర్గా వద్ద ఖాసీం ఆధ్వర్యంలో జరిగిన గ్యార్మీ షరీఫ్ ఉత్సవంలో బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీక గ్యార్మీ షరీఫ్ అన్నారు. అందరూ కలిసి సామరస్యంగా జరుపుకునే వేడుక అని ఆయన పేర్కొన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో..

ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ దర్గాలో నిర్వహించిన గ్యార్మీ షరీఫ్ ఉత్సవంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వడ్డించారు. మల్లేష్, పెద్ద ఖాజా, చిన్న ఖాజా, షౌకత్ అలీ మున్నా, రెహమాన్, శివ, మహేష్, బషీర్, ఖలీమ్, సాయి పాల్గొన్నారు.

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం



పాపిరెడ్డి(ఫైల్)

చందానగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన వ్యక్తి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. చందానగర్ పీఎస్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ జేపీ నగర్‌కు చెందిన సామల పాపిరెడ్డి(46) బీహెచ్ఈఎల్ కంపెనీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 25న జేపీ నగర్ నుంచి సంస్థలో విధులకు వస్తుండగా వెనుక వస్తున్న ద్విచక్రవాహనదారుడు ఆయన బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో పాపిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా సోమవారం రాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. దీంతో పాపిరెడ్డి అవయవాలను ఆయన కుటుంబ సభ్యులు దానం చేశారు. కాగా, ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

షిప్ బవేర్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో లైబ్రరీ ప్రారంభం

రాయదుర్గం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): షిప్ బవేర్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో మంగళవారం లైబ్రరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమాచార, సాంకేతికత, పరిశ్రమల శాఖల ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరై లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత స్కిల్ డెవలప్ చేసుకుంటే పారిశ్రామికంగా రాణించవచ్చన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- అభివృద్ధి పనుల విషయంలో రాజీపడొద్దు
- జలమండలి అధికారులతో సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ



జలమండలి అధికారులు, కార్పొరేటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీపడకూడదని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ జలమండలి కార్యాలయంలో మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జలమడలి ఎండీ అశోక్‌రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ డైరెక్టర్ ఆపరేషన్స్ వీపీ శ్రీధర్, సీజీఎం నారాయణ, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. జలమండలి అధికారులు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని, వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. ఇంజనీరింగ్, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రోడ్డు కటింగ్ సమయంలో తాగునీటి, డ్రైనేజీ పైపులైన్లు వేసేటప్పుడు తవ్విన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆయన ఆదేశించారు. యూజీడీ, రోడ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, తాగునీటి సరఫరా వ్యవస్థను సరిగా నిర్వహించాలని, డ్రైనేజీ పొంగిపొర్లకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, రాగం నాగేందర్ యాదవ్, హమీద్‌పటేల్, దొడ్ల వెంకటేష్‌గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, జనరల్ మేనేజర్లు కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, హరిశంకర్, డీజీఎంలు నారాయణ, నాగప్రియ, శరత్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీనగర్‌లో అక్రమ నిర్మాణాల జోరు



రాజీవ్‌గాంధీనగర్‌లోని రోడ్డు నం.1 చివరిలో ప్రభుత్వ భూమిలో దిల్ సంస్థ గేటును దాటి నిర్మిస్తున్న గది, ముందుగానే పూర్తైన ప్రహరీ నిర్మాణం, దానికి ఎదురుగా మరో రెండు బేస్మెంట్లు

- దిల్ సంస్థ గేటును దాటి ప్రభుత్వ స్థలంలో గదులు, ప్రహరీ, బేస్‌మెంట్ల నిర్మాణం
- బాచుపల్లి మండల నూతన తహసీల్దార్ బాధ్యతలు తీసుకోక పోవడం ఆసరాగా..
- పది రోజులుగా రెచ్చిపోతున్న కబ్జాదారులు

నిజాంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేషన్ బాచుపల్లి మండలం, బాచుపల్లి గ్రామ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్ కాలనీ వెనుక ఉన్న ప్రభుత్వ భూమిలో పది రోజులుగా ఆక్రమణలకు గురవుతోంది. ఆక్రమణదారులు విచ్చల విడిగా గదులు, ప్రహరీలు నిర్మించుకోవడం, మరికొందరు ఆ ప్రాంతంలో ఉన్న చెట్లను ఆసరా చేసుకొని ఏకంగా బేస్మెంట్లు నిర్మిస్తున్నారు. పది రోజుల క్రితం బాచుపల్లి తహసీల్దార్ బదిలీ కాగా, ఆయన స్థానంలో ఇక్కడికి బదిలీ చేసిన తహసీల్దార్ ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టలేదు. ఇదే అదునుగా తీసుకొని రాజీవ్‌గాంధీనగర్‌లోని కబ్జాదారులు మరింత రెచ్చిపోయి ఈ అక్రమ నిర్మాణాలకు తెర లేపారు.

● కొత్త తహసీల్దార్ బాధ్యతలు చేపట్టక పోవడంతో తహసీల్దార్ కార్యాలయంలోని డీటీ, ఆర్ఐతో పాటు ఇతర ఉద్యోగులకు కూడా ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కనీస చర్యలు తీసుకోవాలని ఆలోచన రావడం లేదు. తహసీల్దార్ కార్యాలయ అధికారుల నిర్లక్ష్య ధోరణి కబ్జాదారులకు మరింత ఊతం ఇచ్చినట్లైంది. ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 290, 292ల్లో దిల్ సంస్థకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో రాజీవ్ గాంధీనగర్ రోడ్డు -1లో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు ఈ ప్రాంతంలో ఉండే నాయకుల అండ దండలతో కబ్జా చేస్తున్నారు. రాజీవ్‌గాంధీనగర్ రోడ్డు -1 చివరిలో... అది కూడా దిల్ సంస్థకు కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన గేటును దాటి బాహాటంగా నిర్మాణం చేపట్టి, ప్రహరీ నిర్మించి గేటు కూడా ఏర్పాటు చేశారు.

● రాజీవ్‌గాంధీనగర్‌లో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. 200 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, గదులు, ప్రహరీ నిర్మించడమే కాకుండా దానికి ఎదురుగా మరో 200 గజాల స్థలంలో మరో రెండు బేస్మెంట్లు నిర్మించారు. ఇదే తరహాలో రోడ్డు నంబర్లు 2,3 చివరిలో మరో 2 గదులు అక్రమంగా నిర్మించారు. ఇంకో రెండు గదులు నిర్మించడానికి సామగ్రి తెచ్చి పెట్టుకున్నారు. అదే విధంగా నాగులమ్మ గుడి వెనుక నిర్మానుష్య ప్రాంతంలో బండరాళ్లు, గుట్టల మధ్య మరో రెండు బేస్మెంట్లు నిర్మించారు. ఇలా ఈ రాజీవ్ గాంధీనగర్‌లో 1వ రోడ్డు మొదలు కొని 7వ రోడ్డు వరకు ఈ అక్రమ నిర్మాణాల జాతర కొనసాగుతోంది.



3వ రోడ్డులో నిర్మించిన రెండు గదులు

● గతంలో ఉన్న తహసీల్దార్‌కు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే ఉన్న కింది స్థాయి సిబ్బంది ద్వారా ఆ నిర్మాణాలను నేల మట్టం చేయించే వారు. ఆయన బదిలీ కావడం, నూతన తహసీల్దార్ బాధ్యతలు చేపట్టకపోవడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన అధికార పార్టీ నాయకులు " ప్రభుత్వం మనది.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి గదులు నిర్మించుకోండి' అని తమ అనుచరులకు బాహాటంగా చెప్తుండటం గమనార్హం. అధికారులు ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారా? లేక మరిన్ని నిర్మాణాలను ప్రోత్సహిస్తారో అనేది వేచి చూడాల్సిందే.



నాగులమ్మ ఆలయం రోడ్డులో చెట్ల మధ్యలో నిర్మించిన రెండు బేస్మెంట్లు



మరోగది నిర్మాణానికి స్థలాన్ని శుభ్రం చేసి, సిద్ధంగా ఉంచిన నిర్మాణ సామగ్రి

వెంటనే తొలగిస్తాం

బాచుపల్లి ప్రాంతం రాజీవ్‌గాంధీనగర్ కాలనీ వెనుక సర్వే నెంబరు 290, 292ల్లో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విక్రయం నా దృష్టికి వచ్చింది. తహసీల్దార్ లేకపోవడం వల్ల కూడా కొన్ని సమస్యలు వస్తున్నాయి. రాజీవ్‌గాంధీ నగర్‌లోని రోడ్డు నెం 1 మొదలు కొని చివరి నెంబరు వరకు వెలిసిన అక్రమ నిర్మాణాలు, ప్రహరీ, బేస్మెంట్లు వంటి వాటిని రేపు కూల్చివేస్తాం.

భానుచందర్, బాచుపల్లి మండల ఆర్ఐ





ఛట్‌పూజ చేస్తున్న బిహారీలు, పాల్గొన్న భరత్ సింహారెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో ఛట్‌పూజ

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ ఎంఎన్‌రెడ్డి నగర్‌లో బిహారీలు ఛట్‌పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేడ్చల్ జిల్లా అర్బన్ కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నాలుగు రోజుల పాటు బిహారీలు ఛట్‌పూజ చేస్తారని, శక్తినిచ్చి ఆశీర్వదించాలని కోరుతూ సూర్యభగవానుడిని వేడుకుంటారని ఆయన అన్నారు.



ఛట్‌పూజలో పాల్గొన్న కార్పొరేటర్ జగన్ తదితరులు

యూపీ, బిహార్ వాసుల సమస్యలు పరిష్కరిస్తా

జీడిమెట్ల,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యూపీ, బిహార్ వాసులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం రాత్రి డివిజన్ పరిధిలోని రింగ్‌బస్తీ, మగ్దూం నగర్‌ల్లో యూపీ,బిహార్ ప్రాంతాల వారు నిర్వహించిన ఛట్ పూజకు కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వ హించారు. కార్యక్రమంలో పాపుల్‌గౌడ్, సాయిలుయాదవ్, శ్రీధర్, సాంబయ్య, భాస్కర్,ముఖేష్, రాజ్‌కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



బురద, గుంతలలో అధ్వానంగా తయారైన వార్డు ఆఫీసు రోడ్డు

వార్డు ఆఫీసు రోడ్డును బాగు చేయాలి

గాజులరామారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం వార్డు ఆఫీసుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై ఎక్కడ చూసినా బురద, గుంతలు ఉండటం వల్ల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వార్డు ఆఫీసుకు వివిధ పనులపై వచ్చే వారు అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఈ రోడ్డు గుంతల్లో మట్టిని పోయించి, ప్రజలు సాఫీగా రాకపోకలు సాగించే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



గాజులరామారంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కోటి దీపోత్సవంతో మనస్సుకు ప్రశాంతత

● మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

గాజులరామారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సిద్ధిపేట శ్రీనకులేశ్వరి దేవి నక్షత్ర ఆలయం ఆధ్వర్యంలో గాజులరామారంలో కోటి దీపోత్సవం జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతీ సంవత్సరం గాజులరామారంలో శ్రీనకులేశ్వరి దేవి ఆలయం వారు కోటి దీపోత్సవాన్ని వైభవం నిర్వహిస్తున్నారన్నారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని, దీపోత్సవం చేయడం వల్ల మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని ఆయన అన్నారు. సిద్ధిపేటలోని శ్రీనకులేశ్వర దేవి ఆలయ నిర్వాహకులు, అర్చకులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాను అరికట్టాలి

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): వాల్వ్ నుంచి తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదు. జీడిమెట్ల డివిజన్‌లోని హెచ్ఏఎల్ రాఘవేంద్రకాలనీ కమాన్ సమీపంలో తాగునీరు సరఫరాను ఆన్-ఆఫ్ చేసే మూడు వాల్వ్‌లు ఉన్నాయి. ఇక్కడ తాగునీరు లీకేజీ అవుతోందని పత్రికల్లో వార్త వచ్చినప్పుడు అధికారులు స్పందిస్తూ మరమ్మతులు చేపట్టినా పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోంది. రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీటి కారణంగా రోడ్డుపై గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాల్వ్‌లకు మరమ్మతులు చేసేటప్పుడు నాణ్యమైన సామగ్రి వాడకపోవడంతోనే మళ్లీ లీకేజీలు ఏర్పడి నీరు వృథా పోతున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ ప్రాంతం లో తాగునీరు వృథాగా పోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రాఘవేంద్రకాలనీ కమాన్ సమీపంలో రోడ్డుపై పారుతున్న తాగునీరు



పాత గ్రీన్ హోటల్ నుంచి అంబేడ్కర్‌నగర్ వెళ్లే రోడ్డు జనాలు, వాహనాలతో రద్దీగా మారిన దృశ్యం (ఫైల్)

ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయాలి: కేఎం ప్రతాప్

కుత్బుల్లాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పాత గ్రీన్ హోటల్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేయాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ (డీసీ) నర్సింహను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. పాత గ్రీన్ హోటల్ భవనం నుంచి రేణుక ఎల్లమ్మ ఆలయం, కాకతీయనగర్ కూరగాయల మార్కెట్ మీదుగా అంబేడ్కర్ నగర్ వైపు పెరిగిన జనాభాకు అనుగుణంగా రోడ్లు విస్తరించకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు అధికంగా ఉండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోందని డీసీకి ఆయన వివరించారు. సుమారు రెండు లక్షలకు పైగా ఉన్న పరిసర ప్రాంతాల ప్రజలు చింతల్ ప్రధాన రోడ్డుకు రావడానికి ఇదొక్క రోడ్డే దిక్కుగా మారిందని, నిత్యం వాహనాల రద్దీతో అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు వెళ్లలేని విధంగా ట్రాఫిక్ జామ్ అవుతోందని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ రోడ్డును అందుబాటులోకి తేవాలన్నారు. అదే విధంగా జీడిమెట్ల డివిజన్ పరిధిలోని విమానపురికాలనీలో జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశముందని, టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలన్నారు.



డీసీ నర్సింహకు సమస్యను వివరిస్తున్న కేఎం ప్రతాప్ తదితరులు



కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ ప్రధాన రోడ్డులోని ఓ వైన్ షాపు యజమానికి ఈనెల 27వ తేదీన నిర్వహించిన లాటరీలో మద్యం షాపు దక్కడంతో బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకుంటున్న దృశ్యం.
- కుత్బుల్లాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి)

